ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వానం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మోతె గ్రామస్తులు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జూన్ 15: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతెలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు రామలింగేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసి మోతె గ్రామస్తులు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో మోతె మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, రాజేశ్వర్, రంజిత్, చంద్రం, యాదగిరి పాల్గొన్నారు.

రాయపోల్‌లో...

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గౌడ సంఘం సభ్యులు

రాయపోల్, జూన్ 15: మండల కేంద్రంలో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే ఎల్లమ్మ జమదగ్ని కల్యాణ మహోత్సవాల సందర్భంగా రాయపోల్ గౌడ సంఘం సభ్యులు శనివారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాయపోల్‌లో జరిగే ఎల్లమ్మ ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరశర్మ, మాజీ ఎంపీటీసీ రాజుగౌడ్, మండల నాయకులు నవీన్‌గౌడ్,మురళిగౌడ్ పాల్గొన్నారు.

పద్మశాలీ పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తాం

సిద్దిపేట టౌన్,జూన్ 15 : జిల్లా పరిధిలో పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పద్మశాలీ పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీశ్ తెలిపారు.సిద్దిపేటలో శనివారం ఆయన మాట్లాడారు. జిల్లా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పద్మశాలీ దాతల నుంచి విరాళాలు స్వీకరించనున్నామని పేర్కొన్నారు.పద్మశాలీ విద్యా కమిటీ ద్వారా పేద విద్యార్థులను గుర్తించి త్వరలో ఆర్థికసాయం చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 984813440 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.సమావేశంలో సంఘం నేతలు ముదిగొండ శ్రీనివాస్,భిక్షపతి,శ్రీశైలం పాల్గొన్నారు.

విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 15: విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం దుబ్బాకలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య స్వల్పంగా ఉండటంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించేందుకు అధ్యాపక బృందం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దుబ్బాక మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో నెలకొన్న పలు సమస్యలను ప్రిన్సిపాల్ విమలదేవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆస యాదగిరి. ఆస స్వామి తదితరులు పాల్గొన్నారు.

పరశురామ్‌ని ఆశీర్వదించిన కేసీఆర్

హుస్నాబాద్, జూన్ 15: బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురామ్‌ని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ శనివారం సాయంత్రం ఆశీర్వదించారు. పరశురామ్ పుట్టిన రోజు సందర్భంగా ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పరశురామ్‌కు శాలువాకప్పి, స్వీటు తినిపించారు.

చేర్యాలలో చైన్ స్నాచింగ్

చేర్యాల, జూన్ 15 : పట్టణంలోని హనుమాన్ నగర్ ప్రాంతంలో శనివారం పట్టపగలే చైన్‌స్నాచింగ్ జరగడం స్థానికంగా సంచలనం సృష్టించింది. మండలంలోని కడవేర్గు గ్రామానికి చెందిన నరుకుల వీరమణి పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ఉండే బంధువులను కలిసి తిరిగి ఆమె ఇంటికి నడిచి వస్తున్నది. అదే సమయంలో పల్సర్ బైక్ పై హెల్మెట్ ధరించిన యువకులు ఆమె నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. చేర్యాల పట్టణంలో ఎన్నడూ లేని విధంగా చైన్‌స్నాచింగ్ జరగడంపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

రుద్రేశ్వరాలయంలో కలెక్టర్ పూజలు

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 15 : కొండపాక మండల కేంద్రంలోని రుద్రేశ్వరాలయాన్ని శనివారం కలెక్టర్ ఎం.మనుచౌదరి సందర్శించారు. ఆలయ పూజారులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను ఆలయ పూజారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన రుద్రేశ్వరాలయాన్ని సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న రోడ్డు వెడల్పు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్‌ను జడ్పీటీసీ అనంతుల అశ్వినీప్రశాంత్ కలిశారు. కలెక్టర్ వెంట ఎంపీపీ మంచాల అనసూయా కనకరాములు, మాజీ సర్పంచ్ చిట్టి మాధురి, ఎంపీటీసీ ఆరుట్ల లక్ష్మి ఉన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

మానవ మృగాన్ని శిక్షించాలి

గజ్వేల్, జూన్ 15: ఆరేండ్ల చిన్నారిని చిదిమేసిన మానవ మృగాన్ని పోక్సోచట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కట్నపల్లిలో అభం శుభం తెలియని ఆరేండ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసిహత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి

గజ్వేల్, జూన్ 15: ధరణిలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు రంగారెడ్డి, అహ్మద్, నర్సింహులు, రాజు, వెంకటరాయుడు, వెంకటచారి పాల్గొన్నారు.

‘అంగన్‌వాడీ’లో సామగ్రి పంపిణీ

చేర్యాల, జూన్ 15 : మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం(6)లో శనివారం బి.చరిష్మా పుట్టిన రోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు చిన్నారులకు విద్యా సామగ్రి, స్వీట్లు, కేకులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ శోభ అధ్వర్యంలో చిన్నారులు చరిష్మా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.

రఘునందన్‌రావు ఆరోపణలు మానుకోవాలి

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు సంపత్‌రెడ్డి తదితరులు

సిద్దిపేట, జూన్ 15: తన గెలుపు కోసం బీఆర్‌ఎస్ నాయకులు పనిచేశారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రజనీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు మెరుగు మహేశ్, బీఆర్‌ఎస్ నాయకులు జువ్వన్న, కనకరాజులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాకలో ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతోనే అక్కడ ఓడిపోయాడన్నారు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో సిద్దిపేట ప్రజలకు ఇచ్చిన హామీలను రఘునందన్‌రావు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితులను ఓటు బ్యాంకుగా మార్చుకున్నాడు తప్పా వారికి రఘునందన్‌రావు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో నాయకులు వెంకట్, నర్సింహులు, రమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

ఆధ్య పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సిద్దిపేట అర్బన్, జూన్ 15 : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడం వల్ల ఎంతో మంది తల్లిదండ్రులు ఆర్థిక ఊబిలో కూరుకుపోతున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యా హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సిద్దిపేట పట్టణంలో అధిక ఫీజు వసూలు చేస్తున్న ఆధ్య పాఠశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నేత శ్రీకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలో గుర్తింపు లేకుండా అనేక పాఠశాలలు నిర్వహిస్తున్నా జిల్లా విద్యాధికారి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రైవేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని, వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని పాఠశాలలను సీజ్ చేయాలని లేని పక్షంలో భౌతిక దాడులు చేస్తామని హెచ్చరించారు.

ఆందోళనలు చేస్తే చర్యలు తీసుకుంటాం

జిల్లాలో ఉన్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎవరు కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకొని బలవంతంగా పాఠశాలలను బంద్ చేయించడం, పాఠశాల వద్దకు వెళ్లి పిల్లలకు ఇబ్బంది కలిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ శనివారం ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తరఫున ఏమైనా సమస్యలుంటే విద్యార్థి సంఘాల నాయకులు, జిల్లా విద్యాధికారి, సంబంధిత అధికారులు, కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వాలని.. వారు ఆ సమస్యలపై పాఠశాల యాజమాన్యాలతో మాట్లాడి పరిష్కరిస్తారన్నారు. విద్యార్థి సంఘాల నాయకులు చట్టాన్ని చేతిలోకి తీసుకొని పాఠశాల ఎదుట ధర్నాలు, రాస్తారోకోలు చేసి విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

విద్యార్థులకు అక్షరాభ్యాసం

హుస్నాబాద్‌టౌన్, జూన్ 15: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న హాజరై మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు లింగంనాయక్, ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ శీలం సంధ్య, ఉపాధ్యాయులు రవీందర్, యాదయ్య, అనురాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో...

కొమురవెల్లి, జూన్ 15: మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు గౌరాయపల్లి(1) మర్రిముచ్చాల(2) అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు, చిన్నారుల తల్లిదండ్రులుపాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, జూన్ 15: గజ్వేల్ బాలుర విద్యాసౌధంలోని మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్ పీజీటీ బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 19తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల పిన్సిపాల్ గోపి తెలిపారు. డెమో, ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత సబ్జెక్టులలో పీజీ చేసిన వారు అర్హులన్నారు. గంటల ప్రాతిపదికన బోధించుటకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రోడ్డు నిర్మాణం చేయాలి

హుస్నాబాద్, జూన్ 15: హుస్నాబాద్ పట్టణంలో బంజారా భవన్ వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గిరిజన సంఘాల నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. బంజారా భవన్‌కు వెళ్లే దారిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడాన్ని నిరసిస్తూ బంజారా భవన్ వద్ద శనివారం వంటావార్పు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంజారా భవన్‌కు వెళ్లే దారిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు సత్యంనాయక్, వీరన్ననాయక్, చంద్రునాయక్, శ్రీనివాస్ నాయక్, శ్రీనునాయక్, రాజునాయక్, పవా ర్, రాజయ్యనాయక్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గజ్వేల్, జూన్ 15: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని ఎంవీఐ క్రిస్టఫర్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనలు పాటించకుండా నడుపుతున్న ఏడు ప్రైవేట్ స్కూళ్ల బస్సులను సీజ్ చేశామని, విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు.

భవిష్యత్‌ను నిర్ణయించేది విద్యనే

డిగ్రీ కళాశాలను సందర్శించిన రీజినల్ జేడీ రాజేందర్‌సింగ్

గజ్వేల్, జూన్ 15: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను నిర్ణయించేది విద్యనేనని, అందుకు ప్రతి విద్యార్థి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని అనుకున్న లక్ష్యానికి చేరుకోవాలని ఉన్నత విద్యాశాఖ రీజినల్ జేడీ ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ అన్నారు. శనివారం గజ్వేల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారులు దీపక్‌కుమార్, ముఖేశ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దాం

మహిళా రైతు కూలీలతో ముచ్చటిస్తున్న నాగరాజు

వర్గల్, జూన్ 15: మోస పూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు తగినరీతిలో బుద్ధి చెప్పేరోజులు దగ్గరలోనే ఉన్నాయని బీఆర్‌ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు దేవగణిక నాగరాజు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత శనివారం మండలంలోని ఆయా గ్రామాల ముఖ్య నాయకులను కలిసి పార్టీ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యంకాని హామీలు ఇచ్చి అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఆరు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందన్నారు. అనంతరం జెబ్బాపూర్‌లో మహిళా రైతు కూలీలతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత

హుస్నాబాద్‌రూరల్: మహ్మదాపూర్‌లో చెక్కు అందజేస్తున్న ఎంపీపీ మానస

కోహెడ, జూన్ 15: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం లబ్ధిదారులకు 106 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎంపీపీ కీర్తి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తడ్కల రాజిరెడ్డి, ఎంపీటీసీలు జాగిరి కుమారస్వామి, కొనే శేఖర్, పూల విజయ, వేముల శ్రీనివాస్, నిర్మల , మల్లవ్వ,స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయా గ్రామాల్లో...

హుస్నాబాద్‌రూరల్, జూన్ 15: మండలంలోని మహ్మదాపూర్, గాంధీనగర్, మీర్జాపూర్ గ్రామాల్లో శనివారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ లకావత్ మానస మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆడపిల్లల పెండ్లికి ఇబ్బంది పడవద్దనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవసాని నిర్మల, నాయకులు బంక చందు, శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

తొగుట: పోచమ్మ కుటుంబీకులను పరామర్శిస్తున్న జీడిపల్లి రాంరెడ్డి

చేర్యాల: శ్రీనివాస్ కుటుంబానికి బియ్యం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తొగుట, జూన్ 15: బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పక్షాన అండగా ఉంటామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. శనివారం అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని వెంకట్‌రావుపేటకు చెందిన జంగపల్లి పోచమ్మ (90) మృతదేహానికి నివాళులర్పించి సంతా పం ప్రకటించారు. ఆమె కుటుంబీకులను పరామర్శించి రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పులిగారి శివయ్య, నాయకులు బండారు స్వామిగౌడ్, పాత్కుల బాలేశ్, పరశురాములు ఉన్నారు.

శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలి

చేర్యాల, జూన్ 15: ఇటీవల అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతిచెందిన మెరిండ్ల శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్‌మావో కోరారు.ముస్త్యాలలో మృతుడి కుటుంబీకులను సీపీఎం నాయకులు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. క్వింటాల్ బియ్యం, 15 కిలోల వంట నూనె, ఇతర సామగ్రిని అందజేశారు. గ్రామశాఖ కార్యదర్శి రేపాక కుమార్, రవీందర్, ఎండీ ఎజాస్, కృష్ణమూర్తి, బ్రహ్మయ్య, సహదేవులు, రాహుల్, నాగరాజు, చరణ్ పాల్గొన్నారు. అలాగే శ్రీనివాస్ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్,సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్లు కొంగరి గిరిధర్, చింతల పరశురాములు, బీఆర్‌ఎస్‌వై చేర్యాల ప్రాంత ఇన్‌చార్జి శివగారి అంజయ్య, నాయకులు పచ్చిమడ్ల సాయి, జగన్, పరశురాములు పాల్గొన్నారు.

అధిక సాంద్రతపై రైతులకు అవగాహన

అధిక సాంద్రత పత్తిసాగు విధానాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సిద్దిపేటరూరల్, జూన్ 15: పత్తిలో అధిక సాంద్రతపై రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం అవగాహన కల్పించారు. తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో యాంత్రిక పద్ధతిలో అధిక సాంద్రత పత్తినాటడంపై బండారుపల్లి రైతు క్షేత్రంలో రైతులకు అవగాహన కల్పించారు. తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో ఎకరంలో 25 వేల పత్తి మొక్కలు నాటితే రైతుకు అధిక దిగుబడి వచ్చి లాభం చేకూరుతుందన్నారు. నీటి సంరక్షణ పద్ధతులు, ఆధునిక యంత్రాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయ్, పల్లవి వివరించారు. పత్తి పంట అనంతరం పొద్దు తిరుగుడు, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవచ్చని సూచించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

దుబ్బాక,జూన్15: దుబ్బాక మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి అన్నారు. శనివారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ (సర్వసభ్య) సమావేశం నిర్వహించారు. పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. 25 ఏజెండాఅంశాల్లో 22 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు సహకరించాలి

మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

చేర్యాల, జూన్ 15 : ప్రశాంత వాతావరణంలో ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ కోరారు. పట్టణంలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శనివారం ఏసీపీ సతీశ్ ముస్లిం మతపెద్దలు, మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు బక్రీద్ పండుగకు సహకరించాలని, సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా పర్వదినాలు నిర్వహించుకుంటే బాగుంటుందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దల సూచనలు, సలహాలను ఏసీపీ నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై దామోదర్, సిబ్బంది, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయాలి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్15: ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన మిషన్ భగీరథ నల్లాల సర్వేను వేగవంతం చేయాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని లద్నూర్‌లో కొనసాగుతున్న సర్వేతోపాటు హరిత నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో ఖాజామోహినుద్దీన్, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాములు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

నారాయణరావుపేట, జూన్ 15: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఏవో మహేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో రమణి, ఏఈవోలు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభం

రాయపోల్, జూన్ 15 : విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఉద్దేశంతో మండలంలోని ఎల్కల్ ప్రాథమిక పాఠశాలలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు రూ.25వేల సహాయంతో ఏర్పాటు చేయించిన వాటర్ ప్యూరిఫైయర్‌ను శనివారం ఉపాధ్యాయులు,నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జావేద్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ, కరుణాకర్,సురేశ్, బీజేపీ గ్రామ అధ్యక్షుడు బాలమల్లు, ఓబీసీ మండల ఉపాధ్యక్షుడు ప్రసాద్,ఎస్సీ మోర్చా నాయకులు నవీన్, నాయకుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు కృషి చేద్దాం

మాట్లాడుతున్న జడ్పీటీసీ లక్ష్మీలింగం

మిరుదొడ్డి, జూన్ 15: నులిపురుగుల (నట్టల) నివారణకు గ్రామాల్లోని ప్రజలు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని జడ్పీటీసీ సూకురి లక్ష్మీలింగం, వైస్ ఎంపీపీ పోలీసు రాజులు అన్నారు. శనివారం మిరుదొడ్డి టౌన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజాప్రతి నిధులతో కలిసి డాక్టర్ సమీనా సుల్తానా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవర్ధన్, సీహెచ్‌వో లింగమూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

హుస్నాబాద్, జూన్ 15: రాష్ట్రంలోని విశ్వబ్రాహ్మణులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ దాని వల్ల ప్రయోజనం ఏమీ లేదని, ఈ కార్పొరేషన్‌ను పరిశ్రమల శాఖకు అనుసంధానం చేసి విశ్వకర్మ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం హుస్నాబాద్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి విశ్వకర్మ పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి పంచకులస్తులకు వృత్తి కోసం, ఇతర ఉపాధి మార్గాల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు. . మండల అధ్యక్షుడు సుదర్శనాచారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప్పుల శ్రీనివాస్, కుమారస్వామి, రవీందర్, దామోదర్, శ్రీనివాస్, స్వామి, రాజమౌళి, కనుకయ్య, వెంకటస్వామి, సతీశ్, నరసింహాచారి పాల్గొన్నారు.

దుండగులను శిక్షించాలి

హుస్నాబాద్, జూన్ 15: హైదరాబాద్ నడిబొడ్డున లంబాడీ బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గుగులోతు రాజునాయక్ డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మట్లాడారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన బాలిక కుటుంబ సభ్యులు ఉపాధి కోసం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నివసిస్తున్నారని, సరుకుల కోసం దుకాణానికి వెళ్లిన బాలిక కనిపించకుండా పోయిందని తెలిపారు. వారం రోజులు గడిచినా బాలిక ఆచూకీ తెలుసుకోవడంలో అక్కడి పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, సిద్దిపేట జిల్లా
టెండరు ప్రకటన

Rc.No. A1/Tender/DCO/SDPT/1/2024-25, తేది: 16.06.2024

సిద్దిపేట జిల్లాలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల మిట్టపల్లి, రామక్కపేట, తొగుట, ములుగు, సిద్దిపేట రూరల్, గజ్వేల్ (చౌదరిపల్లి) జగదేవ్‌పూర్ (కొండపాక) బెజ్జంకి (హుస్నాబాద్) బాలికల, అల్వాల్, చేర్యాల హుస్నాబాద్, కొహెడ, దుబ్బాక, వర్గల్ (ప్రజ్ఞాపూర్) కొండపాక (దుద్దెడ) చిన్న కోడూరు (గుర్రాల గొంది) బాలుర మరియు మహిళా డిగ్రీ కళాశాల సిద్దిపేట(మిట్టపల్లి) ‘సీల్డ్’ టెండర్లు కోరబడుచున్నవి.

			EARNEST MONEY	DEPOSIT AMOUNT
క్ర. సం.	అంశం	మహిళా డిగ్రీ కాలేజి	స్కూల్ జూనియర్ కాలేజ్ (అప్‌గ్రేడ్)	షెడ్యూల్డ్ కులాల షెడ్యూల్డ్ తెగల వారికి EMD 60%
1.	ఆహార పదార్థాలు	1,10,000	2,00,000	66,000/1,20,000
2.	కూరగాయలు & పండ్లు	1,00,000	1,20,000	66,000/72,000
3.	మటన్ & చికెన్	60,000	60,000	36,000
4.	గ్రుడ్లు	50,000	50,000	30,000
5.	క్యాటరింగ్	1,00,000	1,00,000	60,000
6.	స్టేషనరీ	-	50,000	-
7.	ల్యాబ్ మెటీరియల్	-	50,000	-

కావున ఆసక్తిగల టెండరుదారులు సంబంధిత పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ వారి పేరున రూ. 1000/- డిడి అంశం వారిగా చెల్లించి తేది : 18.06.2024 నుండి 26.06.2024 వరకు కార్యాలయాల పనివేళలలో ఉ. 10.00 గం. నుండి సా. 4.00 గం.వరకు చివరి రోజు అనగా 26.06.2024 నాడు ఉ. 10.00 గం. నుండి సా. 4.00 గం. యందు సంబంధిత పాఠశాల/కళాశాల నుండి టెండర్ ఫారాలు పొందవచ్చును.

ఆహార పదార్థాలు, స్టేషనరీ ల్యాబ్ మెటీరియల్‌కు సంబంధించిన టెండరు ఫారాలను రూ. 1000/- The Principal TSWRS/JC(Boys) Cherial గారికి డి.డి. చెల్లించి పైన తెలిపిన తేదీలలో చేర్యాల పాఠశాల/కళాశాల నుండి పొందవలెను పూర్తిచేసిన సీల్డ్ టెండరు తేది 26.06.2024 సా. 4.00 గంటలలోపు టెండరు బాక్సులో వేయవలెను. టెండరు వేయు అభ్యర్థులు వారి ఆధార్ కార్డు ప్రతిని సమర్పించవలెను షెడ్యూల్డ్ కులాలు/తెగల వారు కులధృవీకరణ పత్రము కాపీ జతపరచవలెను. ఇట్టి సీల్డ్ టెండరు అదనపు కలెక్టర్ సిద్దిపేట జిల్లా గారి కార్యాలయంలో తేది: 27.06.2024 ఉ. 11.00 గంటలకు టెండరు దారులు మరియు DPC సమక్షములో తెరువబడును. ఇట్టి టెండర్లు వాయిదావేయుటకు గానీ, రద్దుపరచుటకు గానీ అదనపు కలెక్టర్ గారికి పూర్తి అధికారం కలదు.

సం/- ప్రాంతీయ మరియు జిల్లా సమన్వయ అధికారులు
RCO & DCO, TGSWREIS సిద్దిపేట్ జిల్లా

సం/- అదనపు కలెక్టర్
సిద్దిపేట